**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

# భారతీయ సంస్కృతీ వికాసంలో తెలుగు పండుగలు - ఉత్సవాలు - ఆధ్యాత్మిక విశిష్టత

**డాక్టర్ కొప్పాడి శ్రీనివాసరావు**
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ముమ్మిడివరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. ఆంధ్రప్రదేశ్

**ఉపోద్ఘాతం:**

భారతదేశం లౌకికత్వానికి ఎత్తిన పతాక. ఈ పుణ్య భూమి అనేక భాషలు, మతాలు సాంప్రదాయాల సమాహారం. ఈ విభిన్నతలో ఏకత్వాన్ని నిలబెట్టేది భారతీయ సంస్కృతి. ఈ సంస్కృతిలో పండుగలు, ఉత్సవాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. పండుగలు కేవలం వినోదానికి సంబంధించినవి మాత్రమే కాకుండా, మన ఆచారాలు, విశ్వాసాలు, సామాజిక విలువలను ప్రతిబింబించే ప్రతీకలుగా నిలుస్తాయి. తెలుగు ప్రజలు చేసుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. ఇవి మన సాంప్రదాయాలను, ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను, వారసత్వాన్ని భావి తరతరాలకు అందించే అద్భుత సాధనాలు. తెలుగువారి పండుగలు , ఉత్సవాలు భారతీయ సంస్కృతికి ప్రత్యేకతను అందిస్తూ, ప్రాంతీయతతో పాటు జాతీయ ఐక్యతను పెంపొందిస్తాయి.

తెలుగు సంస్కృతి స్వరూప స్వభావం:

తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు, భాష, జానపద కళలు, పండుగలు, ఉత్సవాలు, ఆచార వ్యవహారాల ద్వారా నిర్మితమైంది. ఇది ప్రకృతితో మమేకమై ఉన్న సంస్కృతి. తెలుగు ప్రజలు పండుగలను ఎంతో ఆనందంగా, వివిధ ఆచారపద్ధతులను అనుసరించి జరుపుకుంటారు. ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత, ఒక సందేశం ఉంటుంది. తెలుగు పండుగలను ధార్మిక పండుగలు, ప్రకృతి సంబంధ పండుగలు, ప్రాంతీయ జాతర పండుగలు అని మూడు రకాలుగా విభజించవచ్చు. మన తెలుగు పండుగలు ఉగాది, సంక్రాంతి, రాఖీపూర్ణిమ, మహాశివరాత్రి, హోలీ, శ్రీరామనవమి, వరలక్ష్మి వ్రతం, కృష్ణాష్టమి, వినాయక చవితి, దసరా, నవరాత్రి ఉత్సవాలు, అట్లతద్ది, దీపావళి, కార్తీక దీపోత్సవం, ముక్కోటి ఏకాదశి, రథసప్తమి మొదలైనవి. ఈ పండుగలు ప్రకృతి, కాలచక్రం, దేవతారాధనతో మమేకమై ఉంటాయి. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనను ప్రేరేపిస్తాయి. ఈ పండుగలతో అనుసంధానంగా సిరిమానోత్సవం, కోటప్పకొండ తిరునాళ్ళు, అహోబిలం పార్వేట ఉత్సవం, లేపాక్షి ఉత్సవాలు, కోనసీమ జగ్గన్న తోట ప్రభల తీర్థం, గుణదల

మేరీమాత ఉత్సవం ,రొట్టెల పండుగ, బతుకమ్మ, బోనాలు వంటి జానపద ఉత్సవాలు ప్రాంతీయ సంప్రదాయాలను ప్రతిబింబించడంతో పాటు ఆధ్యాత్మిక భావనను నింపుతాయి.

ప్రకృతితో మమేకమైన తెలుగు జీవనం, పండుగలు - ఉత్సవాల విశిష్టత:

మానవ జీవితం ప్రధానంగా ప్రకృతిపై ఆధారపడి వుంటుంది. ఈ ప్రకృతిలోని మార్పులను జ్యోతిషశాస్త్రం ఆధారంగా గుర్తించి, గ్రహ నక్షత్రాదుల ప్రభావాలను పరిశీలిస్తూ, కాలానుగతకమైన పండుగలను ధర్మశాస్త్రం నిర్ణయిస్తుంది. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం పండుగల ఏర్పాటులో ముఖ్యమైన ఉద్దేశం. నోములు, వ్రతాలు, ఉత్సవాలు, పర్వాలు, పండుగలు అంటూ వాటికి మనం పేర్లు పెట్టుకుంటున్నాం. మన దేశంలో సంవత్సరం మొత్తం ఏదో రూపంలో ఏదో ఒక పర్వం నిర్వహిస్తూనే వుంటారు. పండుగలు, ఉత్సవాలు జరుపుకోవడం వల్ల నూతనోత్సాహం, ఆనందం మరియు సానుకూల దృక్పథం వ్యాప్తి అవుతాయి. పండుగల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి కనుకనే మన పెద్దలు పురాతన సాంప్రదాయాలను గౌరవించడానికి, కుటుంబాలు మరియు సంఘాలను ఒకచోట చేర్చారు. కొన్ని ముఖ్యమైన తెలుగు పండుగలు మరియు వాటి వెనుక ఉన్న సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక అర్థాల సంగ్రహావలోకనం చేద్దాం.

తెలుగువారి నూతన సంవత్సరం - ఉగాది.

ఉగాది తెలుగు ప్రజలకు అత్యంత ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఇది తెలుగు క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసంలో వచ్చే తొలి పండుగ. కొత్త సంవత్సరంలో కుటుంబ సభ్యులంతా కలిసి ఉగాది పచ్చడి అనే ప్రత్యేక ఆహారపదార్థాన్ని తయారు చేస్తారు. ఇది జీవితంలోని విభిన్న భావోద్వేగాలను సూచిస్తుంది. ఇది తీపి, పులుపు, లవణం, చేదు, కారం, వగరు వంటి ఘాటైన ఆరు రకాల పదార్థాలతో తయారు చేయబడిన మిశ్రమం. ఈ ఉగాది పచ్చడి తినకుండా తెలుగువారు ఏ పనీ మొదలు పెట్టరనేంత ప్రాచుర్యం పొందింది. సాంస్కృతిక ప్రాముఖ్యత తేజరిల్లే ఉగాది ప్రకృతి యొక్క గొప్పతనాన్ని మరియు వ్యవసాయ ఉత్సవ ఆవశ్యకతను తెలియజేస్తుంది. తెలుగువారు తమ ఇళ్లను శుభ్రం చేసుకుని, పంచాంగ శ్రవణాలు, ప్రార్థనలలో నిమగ్నమౌతారు. ఆధ్యాత్మికంగా ఉగాది సరికొత్త జీవనం మొదలు పెట్టి, సుసంపన్నంగా జీవించాలని హితబోధ చేస్తుంది.

తెలుగువారి పెద్ద పండుగ -సంక్రాంతి:

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్లంతా కలిసి అత్యంత సంతోషంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. ఈ పెద్ద పండుగ జనవరి మాసం మధ్యలో జరుపుకుంటారు. సంక్రాంతి తెలుగు రాష్ట్రాల్లో పిల్లలు, పెద్దలు విశేషంగా చేసుకునే ఒక ప్రధాన పండుగ. ఇది సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది. భూమిని పచ్చని పంటలతో ఆశీర్వదించినందుకు సూర్యుడి పట్ల భక్తి భావం చూపిస్తారు. ఈ పండుగ నాలుగు రోజుల పాటు ఉంటుంది. భోగి, మకర సంక్రాంతి, కనుమ మరియు ముక్కనుమ. ప్రతి ఒక్కటి దాని ప్రత్యేక ఆచారాన్ని కలిగి ఉంటుంది. సంక్రాంతిని

International Journal of Academic Research
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

రకరకాల పిండి వంటలు, విందు వినోదాలు, రంగురంగుల గాలిపటాలు, ముచ్చట గొలిపే రంగవల్లులు, కోడిపందాలు, సాంప్రదాయ ఆటలు మరియు భోగి మంటలతో జరుపుకుంటారు. పశువులను సైతం పూజిస్తారు. ఇది సమృద్ధిగా పంట కోసం ప్రత్యేక ప్రార్థనలతో ప్రజలను వారి వ్యవసాయ మూలాలకు అనుసంధానించే పండుగ. సంక్రాంతి అనేది ఆధ్యాత్మిక స్పృహను మేల్కొలుపుతుంది. సంక్రాంతి సందర్భంగా ఊరూవాడా ప్రభలతీర్థాలు, జాతరలతో మారుమ్రోగిపోతాయి.

**కోనసీమ ప్రభల ఉత్సవం - విశిష్టత:**

కోనసీమలో ప్రసిద్ధి చెందిన జగ్గన్నతోట ప్రభల తీర్థం 476 ఏళ్లకు పైగా ఘన చరిత్ర కలిగినది. ఈ సాంప్రదాయ ఉత్సవం ప్రతి సంవత్సరం కనుమ రోజున అంటే సంక్రాంతి మరునాడు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మొసలపల్లి, జగ్గన్నతోటలో నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఇక్కడ 11 మంది ఏకాదశ రుద్రులు కొలువవుతారు. ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన ఈ ఉత్సవాన్ని భారత ప్రధాని మోదీ మెచ్చుకోవడంతో పాటు 2026లో రాష్ట్ర పండువుగా గుర్తింపు పొందింది. 17వ శతాబ్దంలో పెద్దాపురం సంస్థానాధీశులైన వత్సవాయి జగన్నాథ మహారాజు ఈ వేడుకను ప్రారంభించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయం- దసరా

దసరాను విజయదశమి అని కూడా పిలుస్తారు. రావణుడిపై శ్రీరాముడు సాధించిన గెలుపుకు గుర్తుగా, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను తెలుగు రాష్ట్రాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పండుగ 10 రోజుల పాటు కొనసాగుతుంది. దసరాకు ముందు వచ్చే నవరాత్రి సమయంలో దైవిక స్త్రీ శక్తిని దుర్గా, లక్ష్మి మరియు సరస్వతి రూపంలో పూజిస్తారు. దసరా సందర్భంగా, తెలుగు ప్రజలు రామలీలాను నిర్వహించడం, దేవాలయాలను సందర్శించడం, ఆయుధపూజ చేయడంతో పాటు జీవితంలోని సవాళ్లను అధిగమించడంలో దైవిక మార్గదర్శకత్వం పొందుతారు. మంచి యొక్క అంతిమ విజయంలో ధర్మాన్ని మరియు విశ్వాసాన్ని నిలబెట్టాలని ఇది మనకు గుర్తుచేస్తుంది.

**దసరా సందర్భంగా జరిగే సిరిమానోత్సవం:**

ఆంధ్రదేశంలో విజయనగరంలో దసరా సందర్భంగా ప్రతిష్టాత్మకమైన సిరిమానోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి విజయదశమి తర్వాత వచ్చే మొదటి మంగళవారం నాడు విగ్రహ ప్రతిష్ట చేస్తారు. అప్పటి

నుండి దసరా తర్వాత వచ్చే మొదటి మంగళవారం పైడితల్లి అమ్మవారి సినిమానోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవానికి దేశ నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు వస్తారు. సుమారు 60 అడుగుల పొడవు ఉండే సిరిమాను చివర ఏర్పాటు చేసిన ఆసనంపై కూర్చున్న పూజారిని పైడిమాంబ అమ్మవారి ప్రతిరూపంగా భావించడం ఈ ఉత్సవంలో ప్రధాన విశిష్టత. మంచి పంటలు పండాలనే ఉద్దేశంతో రైతులు ఈ ఉత్సవాన్ని

**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా జరుపుతారు. ఈ ఉత్సవంలో ఆధ్యాత్మికత తాండవిస్తుంది.

**దేదీప్యమానం -దీపావళి పండుగ :**

తెలుగువారు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగలలో దీపావళి ఒకటి. ఈ పండుగను తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. ఇది వెలుగుల పండుగ. చీకటిపై కాంతి మరియు అజ్ఞానంపై జ్ఞానం యొక్క విజయానికి ప్రతీక. దీపావళి సందర్భంగా ప్రతి ఇంటా నూనె దీపాలు ప్రకాశిస్తాయి. వివిధ రకాలైన బాణసంచా రాత్రి ఆకాశాన్ని ప్రకాశవంతం చేస్తాయి. పురాణాల ప్రకారం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఈ పండుగ జరుపుకుంటారు. అలాగే మరో కథనం ప్రకారం నరకుడనే రాక్షసుడిని శ్రీకృష్ణుడు వధించిన కారణంగా ఈ పండుగను జరుపుకుంటారు. అంతేకాకుండా సంపద మరియు శ్రేయస్సు యొక్క దేవత అయిన లక్ష్మీదేవినీ పూజిస్తారు. దీపాలు వెలిగించడం, పటాసులు పేల్చడం, దుష్ట శక్తుల నిర్మూలనను సూచిస్తుంది. ప్రజలు గత ప్రతికూలతను వీడాలని మరియు భవిష్యత్తును ఆశ, కాంతి మరియు ఆనందంతో స్వీకరించమని వెల్లడిస్తుంది. ఈ పండుగ. ఆత్మపరిశీలనకు, ఆధ్యాత్మికతకు నిదర్శనం.

**సకల సంపదల దేవత ఆరాధనా తత్వం - వరలక్ష్మీ వ్రతం:**

వరలక్ష్మీ వ్రతం తెలుగు మహిళలకు ముఖ్యమైన పండుగ. ఈ పండుగ లక్ష్మీదేవిని ఆరాధిస్తుంది. ఇది శ్రావణ మాసంలో జరుపుకుంటారు. ఈ సమయంలో వివాహిత స్త్రీలు తమ కుటుంబాల శ్రేయస్సు మరియు సంతోషం కోసం ఎంతో నిష్ఠగా పూజ చేస్తారు. తమ ఇళ్లలో ఆధ్యాత్మిక మరియు ఆర్థిక సమతుల్యతను కాపాడుకోవడంలో మహిళలు ముఖ్య భూమికను పోషిస్తారు. స్త్రీలు కొత్త బట్టలు ధరించి, వరలక్ష్మికి పూజలు చేసి, ఆరోగ్యం, సంపదలతో పాటు నిత్య సుమంగళి తనాన్ని ప్రసాదించమని అమ్మవారినిని కోరుకుంటారు. ఈ పండుగ భక్తి, దాతృత్వం మరియు కుటుంబ సంప్రదాయాలు, విలువలను చాటుతుంది.

**బతుకును బ్రతికించే పండుగ బతుకమ్మ:**

తెలంగాణ ప్రాంతంలో ఆచరించే పూల పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు ఎంతో ఉత్సాహంగా మహిళలు జరిపే ఈ పండుగ చివరి రోజును సద్దులు అని వ్యవహరిస్తారు. దసరాకు ఒకటి రెండు రోజుల ముందు ఈ పండుగ వస్తుంది. రంగు రంగుల పూలను ఎంతో మెళకువతో పిరమిడ్ ఆకారంలో పేర్చి, ఆ పువ్వుల కుచ్చెన నడిబొడ్డులోగాని, శిఖరంలోగాని గౌరమ్మను అమరుస్తారు. ఈ పువ్వుల పళ్లెరాన్ని వాకిట్లో ఉంచి కొత్త దుస్తులు ధరించి స్త్రీలు, బాలికలు చేరి దీని చుట్టూ క్రమంగా తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతారు. తర్వాత ఊరేగించి ఈ బతకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు

**మాతృ దేవతను భక్తితో మొక్కే బోనాల పండుగ:**

This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

బోనాలు అనేది తెలంగాణలో జరుపుకునే ప్రత్యేకమైన పండుగ. దీనిని ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలలో జరుపుకుంటారు. మహంకాళి దేవికి అంకితం చేయబడిన బోనాలు, రక్షణ మరియు దీవెనల కోసం కృతజ్ఞతగా అమ్మవారికి అలంకరించిన కుండలలో ఆహారం (బోనం) సమర్పించడం జరుగుతుంది. మహిళలు తమ తలపై నైవేద్యాల కుండలను మోస్తూ, డప్పు వాయిద్యకారులు మరియు నృత్యకారులతో కలిసి స్థానిక దేవాలయాలకు ఊరేగింపుగా వెళతారు. ఈ పండుగను వ్యాధులు మరియు దురదృష్టాలను దూరం చేయడానికి జరుపుకుంటారు. బోనాలు అనేది సామూహిక భక్తి, విశ్వాసాన్ని చూపుతుంది. ఇది ఐక్యతో పాటు ఆధ్యాత్మిక తత్వాన్ని సూచిస్తుంది.

**చల్లంగ చూసే సమ్మక్క సారక్క మేడారం జాతర:**

తెలంగాణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగే ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర. దీనిని కుంభమేళాతో సమానంగా భావిస్తారు. ఇది ఆధ్యాత్మిక భక్తి భావంతో నిండి వుండే ఉత్సవం.

**శైవారాధనా ప్రత్యేక రాత్రి - మహా శివరాత్రి:**

హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగలలో మహాశివరాత్రి ఒకటి. శివరాత్రిని తెలుగు ప్రజలు అపారమైన భక్తి, ఉపవాసాలతో జరుపుకుంటారు. ఈ పండుగ రోజు రాత్రి భక్తులు శివుడిని ఆరాధిస్తారు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రంతా జాగారం చేస్తూ, శివ నామాలను పఠిస్తూ భక్తులతో నిండిపోతాయి. ఉపవాసం శరీరం మరియు మనస్సును పవిత్రం చేస్తుందని నమ్ముతారు. దైవిక స్పృహకు దగ్గరగా ఉంటుంది. మహా శివరాత్రి అజ్ఞానంతో పాటు చీకటిని అధిగమించడాన్ని తెలియజేస్తుంది. సకల సృష్టి స్థితి లయకారకుడైన పరమేశ్వరుడిని పూజించడం ఈ పండుగ ప్రధానోద్దేశం.

**తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే మరికొన్ని ఉత్సవాలు:**

ఆంధ్రప్రదేశ్లో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలలో కోటప్పకొండ ఒకటి. ఇక్కడ ప్రతి మహాశివరాత్రి నాడు జరిగే ప్రభల ప్రదర్శన అద్భుతంగా నిర్వహిస్తారు. అహోబిలం పార్వేట ఉత్సవం శ్రీమహావిష్ణువుకి ప్రతిరూపంగా జరుపుతారు. ఇక్కడ కొలువైన నరసింహస్వామి తన దేవేరి చెంచులక్ష్మితో భక్తులను దీవిస్తారు. అనంతపురంలో లేపాక్షి ఉత్సవాలు ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. లేపాక్షి బసవయ్య లేచి రావయ్య అంటూ శివుని కొలుస్తారు. నెల్లూరులో హిందూ ముస్లింలు ఐకమత్యంతో జరుపుకునే రొట్టెల పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

**గుణదల మేరీమాత ఉత్సవం:** దక్షిణ భారతదేశంలో ఉన్న పెద్ద చర్చిలలో గుణదల మేరీమాత చర్చి ఒకటి. ఇక్కడ ఫ్రాన్స్ దేశంలోని లార్డు నగరం చర్చిలో ఉన్న మేరీమాత విగ్రహాన్ని పోలిన విగ్రహం ఉంది. ఇది గుహలో ఉంటుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో గుణదల మేరీమాత ఉత్సవం జరుగుతుంది.

**International Journal of Academic Research** P-ISSN: 2348-7666: Impact Factor: 7.215
Homepage: https://www.ijar.org.in/
Volume-13, Issue-2(2), Apr-Jun-2026
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**ముగింపు:**

భారతీయ సంస్కృతీ వికాసంలో తెలుగు పండుగలు, ఉత్సవాలు తమ ప్రత్యేకతను చాటుతూనే ఉన్నాయి. ఇవి తెలుగు జీవన విధానాన్ని ఆధ్యాత్మిక లోతులను అందంగా ప్రతిబింబిస్తాయి. ఈ వేడుకలు తెలుగు వారసత్వ సంపదను గుర్తు చేయడమే కాకుండా వ్యక్తిగత ఎదుగుదల, సమాజ హితాన్ని సైతం కోరుకుంటాయి. ఆధ్యాత్మిక జాగృతికి వారధులుగా కూడా ఉపయోగపడతాయి. ఏది ఏమైనప్పటికీ తెలుగు పండుగలు, ఉత్సవాలు దేశ ఔన్నత్యాన్ని చాటి చెబుతాయనడంలో అతిశయోక్తి లేదు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1.మన విశిష్ట ఉత్సవాలు తెలుగుబాట ఏడవ తరగతి తెలుగు వాచకం(2021) ,పీతాంబర బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ,అమరావతి, ఆంధ్ర ప్రదేశ్.

2..తెలుగు జానపద కళారూపాలు (1992), డా.మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాదు.

3. ఆంధ్రుల పండుగలు (1952), సురవరం ప్రతాపరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

4. తెలుగు పండుగలు(1975 ), చిలుకూరు నారాయణరావు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, 5. భారతీయ సంస్కృతి పండుగలు (2001), యండమూరి సత్యనారాయణ నవోదయ పబ్లికేషన్స్.